క్లుప్తంగా

విమ్స్‌లో ఉచిత ఆర్థో వైద్య శిబిరం నేడు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లోని ఆర్థో విభాగంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో తీవ్ర కీళ్ల నొప్పులు, దీర్ఘకాలిక నొప్పులు, నడుము, వృద్ధాప్యం కారణంగా వచ్చే నొప్పులతో బాధపడుతున్నవారికి ఇక్కడ ఉచితంగా పరీక్షలు చేయనున్నట్టు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ (పీఆర్‌పీ) చేయనున్నామన్నారు. ఈ శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

50 మందికి వైద్య పరీక్షలు



బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అపోలో డయాగ్నోస్టిక్ సిబ్బంది ఇక్కడికి వచ్చిన రవీంద్రనగర్, ఆదర్శనగర తోటగరువు, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 50 మందికి బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు. ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాలలో వైద్య శిబిరం నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు.

సాగర తీరంలో జోరుగా ప్రచారం



సాగరతీరంలో ప్రచారం చేస్తున్న మాధవ్

బీచ్ రోడ్డు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తుండడంతో సాగరతీరంలో పలువురు అభ్యర్థులు జోరుగా ప్రచారం చేశారు. బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్, పీడీఎఫ్ అభ్యర్థి రమాప్రభ ఉదయం 6 గంటల నుంచి ఆర్కేబీచ్‌లో వాకింగ్ చేస్తున్న నగరవాసులతో ముచ్చటించారు. తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సీఐఐ చైర్మన్‌గా లాల్‌కృష్ణ నియామకంపై హర్షం



పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్ కృష్ణ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్ చైర్మన్‌గా నియామకం కావడంతో జేఎన్ ఫార్మా పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. రాంకీ ఎండీగా వ్యవహరిస్తూ దేశ విదేశాల నుంచి ఫార్మా కంపెనీలను జేఎన్ ఫార్మాసిటీలోకి తీసుకురావడంతో పాటు ఫార్మా రంగంలో ఆయనకున్న అపార అనుభవమే సీఐఐ చైర్మన్ పదవి అధిష్టించడానికి కారణమని పలువురు పారిశ్రామిక వేత్తలు పేర్కొన్నారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ లాల్‌కృష్ణను రాంకీ కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఐ చైర్మన్ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పదవికి సముచిత న్యాయం చేస్తానని డాక్టర్ లాల్‌కృష్ణ అన్నారు.

బీఆర్‌టీఎస్‌కు మెరుగులు



రామకృష్ణాపురం కూడలి వద్ద గ్రిల్స్, డివైడర్‌కు వేసిన రంగులు



దీన్‌దయాళ్‌పురం వద్ద గోడలపై వేసిన చిత్రాలు

ఆరిలోవ: జీ–20 సదస్సులో భాగంగా నగర రహదారులను అధికారులు అందంగా తీర్చిదిద్దుతున్నారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డును రంగులు వేసి మెరుగులు దిద్దుతున్నారు. ఇప్పటికే హనుమంతవాక నుంచి పెదగదిలి బీఆర్‌టీఎస్‌కు ఓ పక్క గోడలపై వివిధ రకాల పెయింటింగ్‌లు వేశారు. దీన్‌దయాళ్‌పురం నుంచి రామకృష్ణాపురం కూడలి వరకు కొద్ది రోజులుగా గోడలపై పెయింటింగ్ వేస్తున్నారు. వీటితో పాటు బీఆర్‌టీఎస్ రోడ్ల మధ్యలో అమర్చిన గ్రిల్స్, డివైడర్లకు రంగులు వేస్తున్నారు. సుమారు 10 ఏళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన సమయంలో వీటికి రంగులు వేశారు. ప్రస్తుతం పూర్తిగా పాడైపోయాయి. ఇప్పుడు రంగులు వేయడంతో మళ్లీ వీటికి కొత్త శోభ వస్తోంది.



ముడసర్లోవ వద్ద డివైడర్‌కు తెలుపు రంగు వేస్తున్న కార్మికులు

గ్రిల్స్ గతంలో పూర్తిగా పసుపు రంగు మాత్రమే ఉండేది. ఇప్పుడు వాటికి తెలుపు, నలుపు రంగులు వేసి చుట్టూ ఫ్రేమ్‌కు నీలం రంగు వేసి అందంగా తయారు చేస్తున్నారు. డివైడర్లకు తెలుపు, నలుపు రంగులు వేస్తున్నారు. దీంతో ఈ రోడ్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. బీఆర్‌టీఎస్ ఆనుకుని ముడసర్లోవ రిజర్వాయరుతో పాటు దాని పరిసర ప్రాంతంలో ప్రభుత్వ భూములు చుట్టూ సుమారు రూ.10 కోట్ల వ్యయంతో జీవీఎంసీ రక్షణ గోడ నిర్మాణం చేపడుతోంది. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డును ఆనుకుని రిజర్వాయరు పక్కన సుమారు కిలోమీటరుకు పైగా గోడ నిర్మాణం జరుగుతుంది. దీని పనులు కూడా జీ–20 సదస్సు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే పూర్తయిన గోడకు తెల్ల రంగు వేశారు. నాలుగైదు రోజుల్లో దానిపై కూడా పెయింటింగ్ వేయనున్నారు. రహదారులను ముస్తాబు చేయడంతో ఈ ప్రాంతానికి కొత్తదనం వచ్చినట్లు ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ద్వారకా జోన్ ఏసీపీ మూర్తి హెచ్చరిక
- ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి తదితరులు

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ద్వారకా జోన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను ఎంవీపీ స్టేషన్‌కు ఆదివారం పిలిచి ద్వారకా జోన్ ఏసీపీ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేర ప్రవృత్తిని మార్చుకుని సమాజంలో బాధ్యతగల పౌరులుగా జీవించాలని హితవు పలికారు. ప్రశాంత విశాఖ నగరం పేరును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ రౌడీషీటర్ ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ: తనపై గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు దాడి చేశారంటూ ఆదివారం 4వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ రౌడీ షీటర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొందరు వ్యక్తులు దాడి చేశారంటూ ఓ రౌడీషీటర్ డయల్ 100కు సమాచారం అందించాడు. పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే తాను విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్టు తెలిపాడు. దీంతో ఎంవీపీ, ఆరిలోవ పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. తాను హనుమంతవాక వైపు వెళుతుండగా వెంకోజీపాలెం దరి సీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఐదుగురు వ్యక్తులు దాడి చేసినట్లు అతను పోలీసులకు తెలిపాడు. దాడి చేసిన వారు ఎవరనేది తనకు తెలియదని, గతంలో వారిని ఎప్పుడు చూడలేదని వెల్లడించాడు. ఒక వ్యక్తి తనను గట్టిగా పట్టుకోగా, మిగతా నలుగురు కొట్టారని తెలిపాడు. అయితే ఫిర్యాది ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. రౌడీషీటర్ చెప్పిన దాంట్లో వాస్తవాలను విశ్లేషిస్తుండడంతో పాటు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా ఎలాంటి కేసు నమోదు చేయలేదని వెల్లడించారు.

మద్యం దుకాణం మాకొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి ఎక్సైజ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆరిలోవ కాలనీలో ఉన్న మద్యం షాపును ఇక్కడకు తరలించాలనే ఆలోచనలో ఉన్నారు. దీనికోసం ఈ గ్రామంలో బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఓ షాపు అద్దెకు తీసుకున్నారు. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం ఇక్కడకు మద్యం లోడు తీసుకొచ్చినప్పుడు స్థానికులు అడ్డుకున్నారు. మద్యం షాపు మా గ్రామంలో ఏర్పాటు చేయవద్దంటూ మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో షాపు తెరవకుండా అధికారులు వెళ్లిపోయారు. ఆదివారం మళ్లీ షాపు ప్రారంభిస్తున్నట్టు తెలుసుకున్న గ్రామస్తులు కొందరు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. గ్రామం మధ్యలో వైన్ షాపు ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు చేశారు. ఆరిలోవ సీఐ సోమశేఖరరావు సిబ్బందితో వచ్చి గ్రామ పెద్దలతో మాట్లాడారు. మద్యం దుకాణం వద్దని అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని గానీ, ధర్నాకు దిగడం తగదని హితవు పలికారు. గ్రామస్తులకు ఇబ్బంది కలిగే పని ఎవరూ చేయబోరని సీఐ పెద్దలకు తెలియజేశారు. దీంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆలయం పేరుతో భూ ఆక్రమణ

సీతమ్మధార: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయం పేరుతో హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ ఏఎస్ఎన్ రాజు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని శ్రీనివాసరావు కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆక్రమిత స్థలం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992లో కో–ఆపరేటివ్ సొసైటీ పేరిట తమకు స్థలం ఇచ్చారని గుర్తుచేశారు. ఇటీవల దేవాలయ నిర్మాణం కోసం హనుమాన్ ట్రస్ట్ సభ్యులు దేవదాయ శాఖ నుంచి 300 గజాలకు అనుమతి తీసుకున్నారన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో మరో 400 గజాలు అదనంగా తీసుకుని పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చేశారన్నారు. మొత్తం 700 గజాలే కాకుండా సుమారు 2000 గజాల వరకు తమ ప్లాట్‌లో నుంచి స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా పశ్చిమ దిశగా ఉన్న తమ స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమించుకుంటూ పోతున్నారన్నారు. దీనిపై అనుమతుల కోసం దేవదాయ శాఖ జీవీఎంసీ అధికారులను సంప్రదించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. జిల్లా యంత్రాంగం, దేవదాయ శాఖ అధికారులు దృష్టి సారించి ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని సొసైటీ సభ్యులు కోరారు. నిరసనలో వర్మ, ప్రకాష్‌రావు, వెంకటనరసింహరాజు, ఎం.ఎం.రావు, ఎం.హెచ్.జి.రావు, గాంధీరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పైడిమాంబ నవరాత్రి మహోత్సవాలు



పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఆలయ ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 27న అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పూజలు చేస్తామని కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు. మార్చి 2న ఆలయ తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నామన్నారు. మార్చి 7న అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. ఈ ముగింపు ఉత్సవాలలో తప్పెటగుళ్లు, బాణసంచా, గరిడి, పులివేషాలు, తీన్‌మార్, ఒడిశా దూమ్‌దడక్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ఉత్సాహంగా సమైక్యత శోభాయాత్ర



శోభయాత్రలో పాల్గొన్న ఎలయన్స్ క్లబ్ సభ్యులు

బీచ్ రోడ్డు: అసోసియేషన్ ఆఫ్ ఎలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో నిర్వహించిన సమైక్యత శోభయాత్ర ఉత్సాహంగా సాగింది. ఎలయన్స్ అంతర్జాతీయ సదస్సులో భాగంగా ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన శోభయాత్రలో నేపాల్, శ్రీలంక, పిలిప్పీయన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో అధ్యక్షుడు వి.ఎం.రావు, పూర్వ అధ్యక్షుడు తిరుపతిరాజు మాట్లాడుతూ ఎలయన్స్ డిస్ట్రిక్స్ సంస్థల ప్రతినిధులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సభ్యులంతా ఏకతాటిపై ఉండి సంస్థ ఉన్నతికి కృషి చేయాలన్నారు. గతేడాది సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీ గాంధీ, పి.శాంతమ్మ, అనూప్ మిట్టల్, కులదీప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

మర్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కంచరపాలెంలో ఒక గృహిణి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న ముదపాక మౌనిక శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. భర్త ముదపాక సంతోష్ బంధువుల సహాయంతో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరికీ వివాహమై ఎనిమిదేళ్లయింది. ఆరేళ్ల కుమార్తె ఉంది. శనివారం ఉదయం భర్త నిద్ర లేచి చూసేసరికి భార్య మౌనిక కనపడలేదు. ఫోన్ కూడా ఇంట్లోనే వదిలేసి వెళ్లింది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆమె కోసం వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో భర్త సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



ఆనంద మేళాను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహూతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎండాడ చెరువులో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ చెరువులో సంత్ నిరంకారి మిషన్ ప్రాజెక్ట్ అమృత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఇక్కడి చెరువులో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, మిషన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి, నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శివాజీ, ఏపీ పరిరక్షణ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నగర మహిళా అధ్యక్షురాలికి సత్కారం



కృపా జ్యోతిని సత్కరిస్తున్న స్నేహితులు

బీచ్ రోడ్డు: వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలిగా ఇటీవల నియామకమైన కృపాజ్యోతిని తన పదో తరగతి స్నేహితులు ఘనంగా సత్కరించారు. బీవీకే హైస్కూల్ 2004 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృపాజ్యోతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళా అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. అలాగే స్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.


ముగిసిన మెగా జాబ్ ఫెయిర్



ప్రిలిమినరీ రౌండ్‌కు హాజరైన విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీలో నాస్‌కామ్, బుల్లయ్య కళాశాల సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్ ఆదివారంతో ముగిసింది. రెండో రోజు కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. 55 ఐటీ, ఐటీఐ, బీపీవో, నాన్ ఐటీ కంపెనీలు నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 300 కళాశాలల నుంచి సుమారు 13 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్టు బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి తెలిపారు. ప్రిలిమినరీ రౌండ్‌లో ప్రతిభ చూపిన 4,250 మంది విద్యార్థులు ఫైనల్ రౌండ్‌కు ఎంపికైనట్టు చెప్పారు.ఈ రౌండ్‌లో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న మంగళవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి కల్యాణం జరిపించనున్నారు. మార్చి 1న బుధవారం ఉదయం 9 గంటలకు వైదిక సదస్యం, సాయంత్రం 7 గంటలకు పండిత సదస్యం జరగనుంది. మార్చి 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటలకు నిత్య హోమం, సాయంత్రం 7 గంటలకు లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. 04న శనివారం ఉదయం 8 గంటలకు ధ్వజ అవరోహణం, నవకలశ స్నపనం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగం, ఉయ్యాల సేవ, రుత్విక్‌ల సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి నేరెళ్లవలసలో అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 23న జగన్నాథ ఎల్లారావు (57) అదృశ్యమయ్యారు. ఆ రోజు రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఆయన మరుసటి రోజు సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమారుడు జగన్నాథకుమార్ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం ఎల్లారావు మృతదేహం నేరెళ్లవలస సమీపంలో స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.